క్లుప్తంగా

అన్నదానం



అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్న ఆవోపా ప్రతినిధులు

వేంపల్లె : అక్షయ తృతీయ సందర్భంగా వేంపల్లె ఆవోపా మహిళా విభాగ్, శ్రీలక్ష్మీ మ్యూజిక్ బ్యాచ్ సంయుక్త ఆధ్వర్యంలో వేంపల్లె ఆర్టీసీ బస్టాండ్‌లో మజ్జిగ పంపిణీ చేశారు. బుధవారం మెయిన్ బజార్‌కు చెందిన మురికి రాజేష్, హేమలత సౌజన్యంతో వీరి కుమార్తె కావ్యశ్రీ జ్ఞాపకార్థంగా ఆర్టీసీ బస్టాండ్ దగ్గర మజ్జిగ వితరణ, సాయిబాబా గుడిలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కొంతమంది సభ్యుల దాతృత్వంతో పాదరక్షలు, గొడుగుల వితరణ చేశారు. కార్యక్రమంలో ఆవోపా మహిళా విభాగ్ కార్యవర్గ సభ్యులు, శ్రీలక్ష్మీ, మ్యూజిక్ బ్యాచ్ స్టూడెంట్స్ పాల్గొన్నారు.

కలమల్ల ఎస్ఐ బాధ్యతలు స్వీకరణ



ఎస్ఐ సునీల్‌కుమార్‌రెడ్డి

ఎర్రగుంట్ల(జమ్మలమడుగు) : మండలంలోని కలమల్ల పోలీస్‌స్టేషన్ ఎస్ఐ సునీల్‌కుమార్‌రెడ్డి బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. బదిలీలలో భాగంగా ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ తిమోతి కలసపాడు మండలంకు బదిలీ అయ్యారు. కడపలో ఉన్న ఎస్ఐ సునీల్‌కుమార్‌రెడ్డి కలమల్లకు బదిలీ అయ్యారు. ఆయన మాట్లాడుతూ కలమల్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే ఉక్కు పాదం మోపుతామన్నారు.

రక్త దానంతో ప్రాణ దాతలు కావచ్చు



రక్తదానం చేస్తున్న ఉద్యోగులు

ఎర్రగుంట్ల(జమ్మలమడుగు) : థర్మల్ పవర్ ప్రాజెక్టులో ఆర్టీపీపీ కాంట్రాక్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, హ్యాండ్స్‌ఫోర్ యూ స్వచ్ఛంద సేవ సంస్థ ఆధ్వర్యంలో ప్రాజెక్టు ఆసుపత్రి నందు రక్తదాన శిబిరంను ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని ఆర్టీపీపీ సీఈ గౌరీపతి ప్రారంభించారు. 81 మంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆర్టీపీపీ సీఈ మాట్లాడుతూ వేసవి కాలంలో ప్రతి ఒక్క బ్లండ్ బ్యాంక్‌లో రక్తం కొరతగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆర్టీపీపీ అధికారులు ఉద్యోగులు పాల్గొన్నారు.

మెగా జాబ్ మేళాకు విశేష స్పందన



ఎంపికైన మహిళకు అపాయిట్‌మెంట్ లెటర్‌ను అందిస్తున్న మెప్మా అధికారులు

పులివెందుల రూరల్ : పట్టణంలోని మెప్మా కార్యాలయం వద్ద బుధవారం ఏర్పాటు చేసిన జాబ్ మేళాకు మహిళల నుంచి విశేష స్పందన లభించింది. పులివెందులలోని ఆదిత్య బిర్లా కంపెనీ వారు ఈ జాబ్ మేళాను నిర్వహించారు. ఈ సందర్భంగా మెప్మా అధికారులు మాట్లాడుతూ ఈ జాబ్ మేళా ప్రత్యేకించి మహిళల కోసమే ఏర్పాటు చేశారని, అర్హులైన మహిళలందరూ సద్వినియోగపరుచుకోవాలన్నారు. ఆదిత్య బిర్లా కంపెనీ ఆధ్వర్యంలో టైలరింగ్‌కు సంబంధించిన జాబ్ మేళాను ఏర్పాటు చేశారన్నారు. ఈ జాబ్ మేళాలో నిరక్షరాస్యులతోపాటు 5వ తరగతి నుంచి డిగ్రీ చదివిన మహిళలు కూడా పాల్గొని వారి, వారి అర్హతలను బట్టి ఉపాధిని పొందవచ్చునన్నారు. ఈ జాబ్ మేళాకు 185 మంది మహిళలు పాల్గొనగా.. 150 మంది సెలెక్ట్ అయ్యారు. కార్యక్రమంలో అధికారులు మెప్మా అధికారి సీఎంఎం హరిప్రసాద్, ఆదిత్య బిర్లా కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేస్తేనే గుర్తింపు

కడప అర్బన్ : నిబద్ధత, అంకితభావంతో జిల్లా పోలీస్ శాఖకు అందించిన సేవలను ఆ శాఖ ఎప్పటికీ గుర్తుంచుకుంటుందని జిల్లా ఎస్పీ ఈజీ.అశోక్‌కుమార్ అన్నారు. నగరంలోని పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో పదవీ విరమణ పొందిన కానిస్టేబుల్ ఎం.పర్వీన్, ఏఎస్ఐ జయశంకర్, ఎస్ఐ ఎస్.శ్రీనివాసులును బుధవారం ఆయన సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సుదీర్ఘకాలంపాటు శాంతిభద్రతల పరిరక్షణకు సేవలందించడం ఎంతో అదృష్టమన్నారు. పదవీ విరమణ పొందిన తర్వాత కూడా అందరూ పోలీసు కుటుంబంలో సభ్యులేనని, భవిష్యత్తులో ఎలాంటి సాయం కావాలన్నా ఆ శాఖ ఎల్లవేళలా తోడుగా ఉంటుందని ఎస్పీ భరోసా ఇచ్చారు. అనంతరం పదవీ విరమణ పొందిన సిబ్బంది కుటుంబ వివరాలను, పిల్లల చదువులు, ఉద్యోగ స్థితిగతులను గురించి అడిగి తెలుసుకున్నారు.

ఊరెళుతున్నారా.. ఇళ్లు జర భద్రం..!

వేసవి సెలవులు వచ్చేశాయి.. ఇంటిల్లిపాది విహార యాత్రలకు ఊర్లకు, బంధువుల ఇళ్లకు వెళ్తున్నారా.. అయితే జర జాగ్రత్త. మీ ప్రయాణమే వరం అన్నట్లుగా తాళం పడితే చాలు దొంగలు ఇళ్లకు కన్నం వేస్తున్నారు. దాచుకున్న డబ్బు బంగారు అభరణాలను క్షణాల్లో దోచుకెళ్తున్నారు. ఇంటిల్లిపాది దూర ప్రాంతాలకు ప్రయాణాలు చేసే ముందు దొంగతనాలపై అప్రమత్తంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది.

కొండాపురం : కొండాపురంలో ఇటీవల జరిగిన చోరీలను పరిశీలిస్తే చాలా వరకు ఇళ్లకు తాళాలు వేసిన ఇళ్లనే లక్ష్యంగా చోరీలకు పాల్పడుతున్నారు. గతంలో రాత్రి పూట తాళం వేసిన ఇళ్లల్లో చోరీలు జరిగేవి. ప్రస్తుతం తాళం వేసిన ఇళ్లు కనిపిస్తే చాలు పట్టపగలే కొల్లగొడుతున్నారు.

అమలు కాని ఎల్ హెచ్ ఎం ఎస్..?

లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్(ఎల్‌హెచ్‌ఎంఎస్) జిల్లా కేంద్రాలల్లో అమలు అవుతున్న జమ్మలమడుగు నియోజకవర్గంలోని మండలాల్లో అమలు కాలేదు. ఈవిధానం అమల్లోకి వస్తే దొంగతనాలను సులభంగా నివారించవచ్చు. స్మార్ట్ ఫోన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న వారి పూర్తి వివరాలు పోలీస్ కంట్రోల్ రూంకుచేరతాయి. ప్రయాణాలకు వెళ్లే ముందు రోజు అరంకెల కోడ్‌తో పోలీస్‌రిక్వెస్ట్ ఆప్షన్‌లో నమోదు చేసుకోవచ్చు. ఈ యాప్ అమల్లోకి వస్తే నమోదుచేసుకున్న వెంటనే పోలీస్‌సిబ్బంది వారి ఇంటికి వెళ్లి ఎల్‌హెచ్‌ఎంఎస్ పరికరాలను అమర్చుతారు. దీంతో ఇల్లు పోలీసుల విభాగంలో కంట్రోల్‌కి వెళ్తుంది. ఇంట్లో ఎవరు లేని సమయాల్లో అగంతకులు ప్రవేశిస్తే నేరుగా పోలీస్‌కంట్రోల్ రూమ్‌లో అలారం మోగుతుంది. దీంతో స్థానిక పోలీసులు అప్రమత్తమై ఆ ఇంటికి చేరుకుంటారు. ఆవిధంగా ఆ ఇంటికి భద్రత ఏర్పడుతుంది. దీంతో దొంగతనాలను నివారించవచ్చునని పోలీసులు చెబుతున్నారు.



బీరువా పగలగొట్టిన దొంగలు (ఫైల్)

ప్రజలు సహకరిస్తే చోరీల నియంత్రణ

ఇంటర్, పదో తరగతి పరీక్షలు ముగిశాయి. అలాగే జూనియర్ కళాశాలలకు, పాఠశాలలకు సెలవులు రావడంతో కొండాపురం పట్టణం, మండలంలోని పునరావాస కేంద్రాల్లో గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువగా ఊళ్లు, విహార యాత్రలకు వెళ్లుతుంటారు. ఈ సమయంలోనే దొంగతనాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. తాళాలు వేసి ఉన్న ఇళ్లతో పాటు ఆరుబయట నిద్రించే వారి ఇళ్లనే దొంగలు టార్గెట్ చేస్తున్నారు. అభరణాలు డబ్బులు కొల్లగొడుతున్నారు. ప్రజలు ప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు. ఇప్పటి నుంచి ఊర్లకు వెళ్లేవారు, విహార యాత్రలకు, దేవాలయాలకు వెళ్లే వారు పోలీసులకు ముందుగానే సహకరించి దొంగతనాలకు జరగకుండా సహకరించాలన్నారు.

విలువైన అభరణాలు ఇళ్లలో ఉంచుకోవద్దు



దొంగతనాలు జరగకుండా ప్రజలు పోలీసుల సలహాలు సూచనలు తప్పకుండా పాటించాలని విలువైన వస్తువులు అభరణాలు ఇళ్లలో ఉంచకుండా బ్యాంక్ లాకర్లలో భద్రపరచుకోవాలి. దొంగలు తాళం వేసిన ఇళ్లను టార్గెట్ చేస్తుంటారు. ఎవరైనా సరే విహార యాత్రలకు ఊర్లకు వెళ్లే వారు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సమాచారం అందిస్తే ఆ ప్రాంతంలో గస్తీ ఏర్పాటు చేసి దొంగతనాలు జరగకుండా చూస్తాం. మీ ప్రంతాల్లో కొత్త వ్యక్తులు సంచరిస్తున్నట్లు అనిపిస్తే సెల్‌ఫోన్‌లో వారి ఫొటోలు తీసుకోవాలి. వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. మండల కేంద్రంలో త్వరలో లాక్డ్ హౌస్ మనిటరింగ్ సిస్టమ్‌ను అమల్లోకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తాం.

– సీఐ మహమ్మద్ రఫీ, కొండాపురం

అభివృద్ధి పనులకు ప్రజలు సహకరించాలి



సమావేశంలో పాల్గొన్న చైర్ పర్సన్ మార్పురి మేరి

కమలాపురం : నగర పంచాయతీ పరిధిలో ఎమ్మెల్యే చైతన్యరెడ్డి శంకు స్థాపన చేసిన అభివృద్ధి పనులకు ప్రజలు సహకరించాలని కమలాపురం మున్సిపల్ చైర్ పర్సన్ మార్పురి మేరి తెలిపారు. బుధవారం స్థానిక ఆ కార్యాలయంలో కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. మున్సిపల్ సిబ్బంది పలు అంశాలను చదివి వినిపించారు. వాటిపై సభ్యులు చర్చించారు. ఇటీవల సీసీ రోడ్లు, పైప్ లైన్ నిర్మాణం, పంపు సెట్ల ఏర్పాటు తదితర పనులకు శంకుస్థాపన చేశారని, ఆ పనులకు పట్టణ ప్రజలు సహకరించాలన్నారు. మున్సిపల్ కమిషనర్ పగడాల జగన్నాథ్ మాట్లాడుతూ పట్టణ పరిధిలో ఆస్తి పన్ను, నీటి పన్ను వసూళ్లలో సహకరించినవారికి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ సాదిక్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

రేపు ప్రముఖ వైద్య నిపుణుల రాక

పులివెందుల : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో శుక్రవారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. చర్మవ్యాధుల ప్రముఖ వైద్య నిపుణురాలు డాక్టర్ ఎస్.సౌజన్య సోరియాసిస్, తామర, గజ్జి, ఫంగస్ ఇన్‌ఫెక్షన్, మొటిమలు, బెదులు, దద్దుర్లు, చుండ్రు తదితర చర్మ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. చెవి, ముక్కు, గొంతు వ్యాధుల శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ వి.ప్రతాప్‌రెడ్డి చెవిలో చీము కారుట, చెవి నొప్పి, చెవిలో శబ్దములు, చెవిలో కర్ణ బేరికి రంధ్రం, చెవిటి మిషన్లు అమర్చడం, చెవిలో బలపాలు, పూసలు తీయట, ముక్కు దూలం సరిచేయుట, అలర్జీ, సైనుసైటిస్, ముక్కులో రక్తం కారుటకు, ముక్కులో బలపాలు, పూసలు తీయుట, ముక్కులో గడ్డలకు, ఎండోస్కోపి సైనస్ సర్జరీ, గొంతులో గడ్డలకు శస్త్ర చికిత్స, స్వర పేటికలో లోపాలకు చికిత్స, గొంతులో ఇరుక్కుపోయిన చేప ముల్లులు, నాణేలు తీయుట, గొంతులో ఇన్‌ఫెక్షన్‌కు మాటలు రానివారికి చికిత్స, తలనొప్పి, తల తిరుగుట చికిత్స, చెవి, ముక్కు, గొంతునకు సంబంధించిన అనేక సమస్యలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

రేషన్ కార్డు ఈకేవైసీ నిరంతర ప్రక్రియగా మార్చాలి

పులివెందుల టౌన్ : రేషన్ కార్డు ఈకేవైసీ నిరంతర ప్రక్రియగా మార్చాలని, కూటమి ప్రభుత్వం నిర్ణయం వలన ప్రజలకు లేనిపోని కష్టాలు మొదలయ్యాయని వైఎస్సార్‌సీపీ పట్టణ ఉపాధ్యక్షుడు పార్నపల్లె కిశోర్ తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో కేవలం 65 శాతం మంది ప్రజలు మాత్రమే ఈకేవైసీ నమోదు చేసుకున్నారని, రాష్ట్రంలో రేషన్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరూ ఈనెల 30వ తేదీలోగా ఈకేవైసీ చేయించుకోవాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు.

అయితే రేషన్ కార్డులో పేరున్న ప్రతి ఒక్కరూ ఈ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని, లేదంటే రేషన్‌తోపాటు ప్రభుత్వ పథకాలు నిలిచిపోయే అవకాశం ఉందనే కూటమి ప్రభుత్వ నిర్ణయం ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తోందన్నారు. ఉపాధి కోసం వేరే ప్రాంతాలకు వెళ్లిన వారు, ఇతర ప్రాంతాలలో చదువుకుంటున్న పిల్లలు పరీక్షల సమయంలో సొంత ప్రాంతాలకు రావాలంటే ఇబ్బందిగా ఉందని పిల్లల తల్లిదండ్రులు, వలసదారులు ఆందోళన చెందుతున్నారన్నారు. ప్రభుత్వం తీసుకునే ఏ నిర్ణయమైనా ప్రజలకు మేలు చేకూర్చేలా ఉండాలని, ఇలాంటి నిర్ణయాల వలన ప్రజలు రేషన్ కార్డు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుని ఈ ప్రక్రియను నిరంతర ప్రక్రియగా చేపట్టాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఉచిత ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

వేముల : ప్రైవేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఉచిత ప్రవేశాలకు విద్యాహక్కు చట్టం–2009 ప్రకారం ఉచితంగా ప్రవేశాలు పొందడానికి దరఖాస్తులు చేసుకోవాలని ఎంఈఓ చంద్రశేఖర్ తెలిపారు. బుధవారం స్థానిక ఎంఈఓ కార్యాలయంలో ఆయన కరపత్రాలు, పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. ఈనెల 28వ తేదీ నుంచి మే 15వ తేదీవరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. అనాథపిల్లలు, హెచ్ఐవీ బాధితులు, దివ్యాంగులు, షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగలు, బీసీ, మైనార్టీ, ఓసీ అల్ప ఆదాయ వర్గాల వారు అర్హులన్నారు. సీబీఎస్ఈ, ఐబీఎస్ఈ సిలబస్‌ను అనుసరిస్తున్న పాఠశాలల్లో ప్రవేశానికి 2019 ఏప్రిల్ 2వ తేదీ 2020 మార్చి 31వ మధ్య కాలంలో జన్మించి 5 ఏళ్ల వయస్సు నిండి ఉండాలన్నారు. అలాగే స్టేట్ సిలబస్ పాఠశాలల్లో ప్రవేశానికి 2019 జూన్ 2 నుంచి 2020 మే 31 మధ్య జన్మించి ఉండి 5 ఏళ్లు నిండి ఉండాలన్నారు. ప్రైవేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో 25 శాతం సీట్లు కేటాయించడం జరిగిందన్నారు. నివాస ప్రాంతం నుంచి పాఠశాలకు ఒక కి.మీ దూరం నుండి వారికి ప్రాధాన్యత ఉండాలన్నారు. అలాగే పాఠశాలలో 3 కి.మీ దూరం ఉన్న వారికి పరిగణలోకి తీసుకుంటారన్నారు. దరఖాస్తులు చేయడానికి ఆధార్ కార్డు, ఓటరు గుర్తింపు కార్డు, ఉపాధి హామీ జాబ్ కార్డు వాటిలో ఏదో ఒకటి ఉండాలని, పిల్లల వయస్సు ధృవీకరణ పత్రం కూడా ఉండాలన్నారు. ఎంపికైన విద్యార్థుల జాబితా వివరాలను వారి మొబైల్ ఎస్ఎంఎస్ ద్వారా తెలియజేయడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని అర్హులైన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.



ఎంఈఓ కార్యాలయం వద్ద పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎంఈఓ, సిబ్బంది

ఉచిత న్యాయ సహాయాన్ని సద్వినియోగం చేసుకోండి

జమ్మలమడుగు రూరల్ : జైలులో పేదవారు ఉంటే వారికి ఉచితంగా న్యాయ సహాయాన్ని అందిస్తామని జిల్లా సివిల్ జడ్జి ఎస్.బాబా ఫక్రుద్దీన్ తెలిపారు. బుధవారం పట్టణంలోని సబ్‌జైల్‌ను ఆయన అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తప్పు చేసి జైలు జీవితం గడిపిన వారు బయటకు వెళ్లిన తరువాత వారిలో మార్పు రావాలని సూచించారు. అనంతరం జైలు పరిసరాలను, భోజనాలను ఆయన పరిశీలించారు. ఏమైన సమస్యలు ఉంటే తనకు తెలపాలని ఆయన తెలిపారు.



ఖైదీల వివరాలు అడిగి తెలుసుకుంటున్న జడ్జి

పారిశుద్ధ్య కార్మికుల సమ్మె విరమణ

వేంపల్లె : వేంపల్లె గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు తమకు 5 నెలల నుంచి జీతాలు ఇవ్వలేదని గురువారం నుంచి సమ్మెకు పిలుపునిచ్చారు. బుధవారం గ్రామసర్పంచ్ ఆర్.శ్రీనివాసులు పారిశుద్ధ్య సిబ్బందితో చర్చలు జరిపి సమ్మెను విరమింప జేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ వేంపల్లి గ్రామపంచాయతీకి సాంకేతిక కారణాలవల్ల ఈవో లేకపోవడంవల్ల ఈ సమస్య ఏర్పడిందన్నారు. కొత్త ఈవో రెండు మూడు రోజుల్లో రావచ్చునని, వచ్చిన వెంటనే మీకు రావలసిన ఐదు నెలల జీతభత్యాలన్నీ మొదటగా చెల్లిస్తారన్నారు. దీంతో సర్పంచ్ హామీ ఇవ్వడంతో పారిశుద్ధ్య కార్మికులు రెండవసారి సమ్మెను విరమించుకున్నారు.

కలెక్టర్‌ను కలిసిన కడప ఎంపీ

వేంపల్లె గ్రామపంచాయతీలో ఈవో లేకపోవడంతో పారిశుద్ధ్యం, డ్రైనేజీ వ్యవస్థలు అధ్వానంగా తయారయ్యాయని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, వేంపల్లె జెడ్పీటీసీ ఎం.రవికుమార్‌రెడ్డిలు జిల్లా కలెక్టర్ చెరుకూరు శ్రీధర్‌కు తెలిపారు. బుధవారం కడప జిల్లా కలెక్టరేట్‌లోఆయనను వారు కలిసి మాట్లాడారు. గత రెండు నెలలుగా గ్రామపంచాయతీలో ఈవో లేకపోవడంతో ఎక్కడ చూసినా చెత్తాచెదారాలతో నిండిపోయి ఉన్నాయన్నారు. త్వరగా ఈఓను నియమించాలని కోరారు. అంతేకాకుండా అక్కడ పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు, సచివాలయ ఉద్యోగులకు ఐదు నెలలుగా జీతాలు అందలేదని తెలిపారు. అలాగే తాగునీటికి రెండు మోటర్లు కావాలని కోరారు. స్పందించిన కలెక్టర్ మూడు రోజులపాటు వేంపల్లె గ్రామపంచాయతీలో డీపీఓ రాజ్యలక్ష్మి పర్యటించి పారిశుద్ధ్యం, డ్రైనేజీ వ్యవస్థలను చక్కదిద్దాలని ఆదేశించారు. వేంపల్లె గ్రామపంచాయతీకి చిట్వేలు ఈవో రామసుబ్బారెడ్డిని నియమించామని, ఆయన అక్కడ రిలీవ్ అయ్యారని రెండు రోజుల్లో వేంపల్లి గ్రామపంచాయతీలో బాధ్యతలు చేపడతారన్నారు. వేసవిలో తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.



పారిశుద్ధ్య కార్మికులతో మాట్లాడుతున్న సర్పంచ్ శ్రీనివాసులు

వైభవంగా బసవ జయంతి వేడుకలు



గ్రామోత్సవంలో కలశాలతో మహిళలు



బసవేశ్వరుడికి పూజలు చేస్తున్న భక్తులు



కోలాట ప్రదర్శనలో కళాకారులు

పులివెందుల టౌన్ : పట్టణంలోని ఉమామహేశ్వర స్వామి ఆలయం(బసవన్న కట్ట)లో బుధవారం 892వ బసవ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గురు జంగమ వీరశైవ లింగాయతి సంఘం ఆధ్వర్యంలో ఈ వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఉదయం ఉమామహేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి అభిషేకాలు చేశారు. రెడ్డి విశ్వనాథం, ఉమాదేవి దంపతుల ఆధ్వర్యంలో నూతనంగా తయారు చేయించిన రూ.1.25లక్షల విలువ చేసే బసవేశ్వరస్వామి పంచలోహ విగ్రహాన్ని చేయించారు. ఈ సందర్భంగా వారు తమ ఇంటి వద్ద నుంచి మంగళ వాయిద్యాలతో ఊరేగింపుగా వచ్చి ఆలయంలో కొలువుతీర్చారు. అనంతరం విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం ప్రత్యేక వాహనంలో బసవేశ్వరుడి గ్రామోత్సవం వెంబడి వీరశైవ లింగాయతి మహిళలు కలశాలు పట్టుకుని గ్రామోత్సవంలో పాల్గొన్నారు. భక్తులు హరహర మహదేవ శంభో శంకర, జై బసవేశ్వర నామస్మరణలతో ముందుకు సాగారు. ఈ గ్రామోత్సవంలో కొత్తపల్లె పవన్ బృందంచే కోలాట ప్రదర్శన ప్రత్యేకంగా ఆకట్టుకుంది. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని అమ్మవారిశాల వీధి, మెయిన్ బజార్, పూలంగళ్ల సర్కిల్, ముత్యాల వారి వీధి, గాడిచర్ల వారి వీధుల మీదుగా గ్రామోత్సవం నిర్వహించారు.

నేటి నుంచి ఉరుసు ఉత్సవం

జమ్మలమడుగు రూరల్ : పట్టణంలోని పలగాడి వీధిలో వెలసిన హజరత్ సయ్యద్ షా బడే గౌస్‌పీరా ఖాద్రీ ఉరుస్సు ఉత్సవం శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నట్లు అస్థాన ఏ గౌసియా దర్గా పీఠాధిపతి సయ్యద్ షా గౌస్‌పీరా ఖాద్రీ (ప్రభుత్వ ఖాజీ) తెలిపారు. ఈ సందర్భంగా దర్గాలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మే 1వ తేదీ నుంచి 12వ తేదీ వరకు దర్గా ఉరుసు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. శుక్రవారం 1వ తేదీ నిషాన్, 3వ తేదీ హిజామా ఉచితంగా క్యాంపు (కప్పింగ్ థెరపీ), 4వ తేదీ ఖత్నా (ఉచిత వడుగుల కార్యక్రమం), 5వ తేదీ సర్వమత సమ్మేళనం, 7వ తేదీ స్కూల్ పిల్లలచే సాంస్కృతిక కార్యక్రమం, 9వ తేదీ గంధం, 10వ తేదీ ఉరుసు గొప్ప ఖవ్వాలి పోటీలు, 12వ తేదీ జియారత్‌తో ఉరుసు వేడుకలు జరుగనున్నట్లు ఆయన తెలిపారు. భక్తులు పాల్గొని వేడుకలను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

పిల్లలకు ఆటల పోటీలు



ఆటలాడుతున్న పిల్లలు

సింహాద్రిపురం : స్థానిక గ్రంథాలయంలో సమ్మర్ క్యాంపులో భాగంగా బుధవారం పిల్లలకు ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ గంగాదేవి విద్యార్థులకు మంచి అలవాట్ల గురించి, గురువులను గౌరవించడం ఎలా అనే అంశాల గురించి వివరించారు. అలాగే పిల్లలకు నీతి కథలు చెప్పడం జరిగింది. అనంతరం పిల్లలు ఆటలతో సరదాగా గడిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

సాంకేతిక విద్యతో ఉపాధి అవకాశాలు

వేంపల్లె : సాంకేతిక విద్యతో ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయని కందుల ఓబుళరెడ్డి ఐటీఐ ప్రిన్సిపాల్ ప్రసాదరావు తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో ఉద్యోగ అవకాశాలు లేక ఎంతోమంది నిరుద్యోగులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. చదవడం ఒక ఎత్తు అయితే, ఉద్యోగం సంపాదించడం మరొక ఎత్తు అన్నారు. ఒకప్పుడు చదువు అనేది అందరికి అందుబాటులో ఉండేదని, ప్రస్తుతం అదే చదువును కొనుక్కునే పరిస్థితి వచ్చిందన్నారు. ప్రస్తుత రోజుల్లో అందరూ ఇంటర్మీడియట్, బిటెక్ చదువులపైనే ఆసక్తి చూపుతుండటంతో అటు ఉద్యోగాలు లేక, ఇటు కంపెనీలు రాక ఎంతోమంది నిరుద్యోగులుగా మిగిలిపోవడం జరుగుతోందన్నారు. ఎన్నో కంపెనీలు ఐటీఐ చదివిన అభ్యర్థులు లేక కంపెనీలను తగినంత సామర్థ్యంతో నడపలేకపోతున్నారన్నారు. ఐటీఐ చదివిన విద్యార్థులకు శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వాలు ముందుకు వస్తున్నాయన్నారు. అయా కంపెనీలు కూడా ఐటీఐ చదివిన విద్యార్థుల కోసం ఎదురు చూస్తున్నాయన్నారు.

4న లాంగ్‌మార్చ్

కడప సెవెన్‌రోడ్స్ : వక్ఫ్ సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తూ 4వతేదీ కడప నగరంలో నిర్వహించనున్న లాంగ్ మార్చ్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని మాజీ ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ.అంజద్‌బాషా కోరారు.

కల్యాణం.. కమనీయం





కల్యాణ ఘట్టాన్ని తిలకిస్తున్న భక్తులు, మంగళ సూత్రాలను చూపుతున్న పురోహితులు

కమలాపురం : మండలంలోని సంబటూరులో వెలసిన శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవస్వాముల వారి కల్యాణం కమనీయంగా జరిగింది. శ్రీ లక్ష్మీచెన్నకేశవస్వామి వారి 34వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజల ఆధ్వర్యంలో కల్యాణం వైభవంగా నిర్వహించారు.

భక్తజనులు వీక్షిస్తుండగా పురోహితులు అమ్మవార్ల మెడల్లో మంగళ సూత్రాలను ధరించారు. అంతకు ముందు సుప్రభాత సేవ, పంచామృతాభిషేకములు నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని కాయ కర్పూరం సమర్పించి తమ భక్తిని చాటుకున్నారు. అనంతరం భక్తులకు నిర్వాహకులు అన్నదానం ఏర్పాటు చేశారు. సాయంత్రం గ్రామంలోని పుర వీధుల గుండా శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ లక్ష్మీచెన్నకేశవ స్వామి వారి ఉత్సవ విగ్రహాలకు గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచిపెట్టారు. అనంతరం నిర్వహించిన స్వామి వారి ఉయ్యాల సేవను వీక్షించేందుకు భక్తులు ఆసక్తి చూపారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా అలరించాయి.

80 ఏళ్ల తర్వాత పెద్దమ్మతల్లి దేవర

సింహాద్రిపురం : 80 ఏళ్ల తర్వాత పెద్దమ్మతల్లి దేవరకు గ్రామ పెద్దలు సిద్ధమయ్యారు. మే 3, 4వ తేదీలలో సింహాద్రిపురంలో పెద్దమ్మ దేవర నిర్వహించేందుకు గ్రామ పెద్దలు, గ్రామస్తులు ఏర్పాట్లు పూర్తి చేశారు. మే 3వ తేదీన శనివారం ఉదయం 9 గంటలకు దున్నపోతు ఊరేగింపు కార్యక్రమం, అన్న ప్రసాద కార్యక్రమం, సాయంత్రం 4 గంటలకు పెద్దమ్మతల్లి ఉత్సవ విగ్రహం ఊరేగింపు, శనివారం అర్ధరాత్రి 12 గంటల బలి కార్యక్రమం అనంతరం పోలి కార్యక్రమం ఉంటుందన్నారు. పోలి కార్యక్రమం పూర్తైన తర్వాత కొత్తూరు చౌడేశ్వరిదేవి జ్యోతుల కార్యక్రమం ఉంటుందన్నారు. అనంతరం ప్రజలు తమ మొక్కుబడులు చెల్లించుకుంటారన్నారు. ఆదివారం సాయంత్రం 4 గంటల నుంచి అమ్మవారి ఉత్స విగ్రహాల ఊరేగింపుగా పెద్దమ్మ గద్ద దగ్గర వరకు జరుగుతుందన్నారు. ఈ దేవరలో ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.



పెద్దమ్మతల్లి విగ్రహం

పహాల్గామ్ దాడి పిరికిపంద చర్య

జమ్మలమడుగు : పహాల్గామ్‌లో ఉగ్రవాదులు చేసిన దాడిని పిరికి పంద చర్య అని జామియా మసీదు పీఠాధిపతి సయ్యద్‌షా సాదిక్‌పాషా ఖాద్రీ తెలిపారు. బుధవారం వైఎస్సార్‌సీపీ ఒకటో వార్డు కౌన్సిలర్ ముల్లా జానీ ఆధ్వర్యంలో ఉగ్రవాదులు 27 మంది పర్యాటకులను పొట్టన పెట్టుకున్నందుకు నిరసనగా పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పీఠాధిపతి మాట్లాడుతూ పాకిస్థాన్ ఉగ్రవాదాన్ని ప్రొత్సహిస్తూ భారత్‌ను దొంగదెబ్బ తీసే ప్రయత్నం చేస్తుందన్నారు. ఇలాంటి ఉగ్రవాదులను భారత్ ఏరిపారెస్తుందన్నారు. ఉగ్రవాదులకు వ్యతిరేకంగా భారత ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు తాము పూర్తి స్థాయిలో మద్దతు తెలుపుతామన్నారు. అనంతరం పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ పాకిస్థాన్ జాతీయ జెండాను కాల్చి తన నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఫయాజ్ బాషా, తదితరులు పాల్గొన్నారు.



పాకిస్థాన్ జాతీయ జెండాను కింద పడేసి నిరసన తెలియజేస్తున్న ముస్లింలు

వీఆర్ఏలకు వేతనాలు పెంచాలని ధర్నా

కడప సెవెన్‌రోడ్స్ : గ్రామ సేవకులకు వేతనాలు పెంచాలని, కనీసం రూ.26వేలు ఇవ్వాలని వీఆర్ఏల సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు మనోహర్ డిమాండ్ చేశారు. కడప కలెక్టరేట్ వద్ద వీఆర్ఏ యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ అర్హులైన గ్రామ సేవకులకు పదోన్నతులు కల్పించకపోవడం అన్యాయమని తెలిపారు. ఇళ్ల స్థలాలు కేటాయించాలని, 70 శాతానికి పదోన్నతులు పెంచాలని కోరారు. లేబర్ కోడ్స్‌కు వ్యతిరేకంగా మే 20న జరిగే సమ్మెలో అందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వెంకటసుబ్బయ్య, చంద్రారెడ్డి, నాగేంద్ర, వెంకటపతి, రమణ, పవన్, మునెయ్య పెద్ద నారాయణ, వెంకటసుబ్బయ్య, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా జాయింట్ కలెక్టర్ అతిథి సింగ్‌ను వారు కలిసి వినతిపత్రం సమర్పించారు.